అదనపు కలెక్టర్‌గా చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా కె.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. ఆయన ప్రస్తుతం హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమా ప్రాజెక్ట్ ఓఎస్‌డీగా పని చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఆయన్ను జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమించింది. గతంలో ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఎంవీ భూపాల్‌రెడ్డి ఏసీబీ కేసులో అరెస్టు కావడం, ఆ తర్వాత ఆయన స్థానంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆమె మెటర్నిటి లీవ్‌లో వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కేశంపేట ఆర్ఐకి డీటీగా ప్రమోషన్



కేశంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నివేదితకు ప్రభుత్వం నాయబ్ తహసీల్దార్(డీటీ)గా ప్రమోషన్ ఇచ్చింది. ఈ మేరకు కలెక్టర్ నారాయణ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(టీఏఎల్ఐఎం)తలింకు ఆమె డీటీగా బదిలీపై వెళ్లనున్నారు. నాలుగేళ్లుగా కేశంపేట మండల ఆర్ఐగా విధులు నిర్వర్తించిన నివేదిత ప్రజల మన్ననలు పొందారు.

ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్వీస్ రిజిస్టర్లు, సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



పదోన్నతుల పండగ!

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులకు ప్రమోషన్స్

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న గెజిటెడ్ హెడ్‌మాస్టర్, స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 2వ తేదీన ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ 11వ తేదీతో ముగియనుంది. జూలై 31వ తేదీ వరకు ఖాళీగా ఉన్న పోస్టులను పరిగణనలోకి తీసుకుని పదోన్నతుల జాబితాలో సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించనున్నారు.

- మొత్తం ఎనభై జీహెచ్ఎం ఖాళీలు
- వికారాబాద్‌లో 31, మేడ్చల్‌లో 25, రంగారెడ్డిలో 24 వేకెన్సీలు
- స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతులకు పూర్తయిన సర్టిఫికెట్ల పరిశీలన



డీఈవో కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గెజిటెడ్ హెచ్ఎంల పదోన్నతుల కోసం జూలై మొదటి వారంలో కేటగిరీల వారీగా స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేసే సీనియర్ స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ రిజిష్టర్లు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. అయితే ఎస్జీటీ ఉపాధ్యాయులకు కొత్త గుబులు పట్టుకుంది. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టుల్లో పదోన్నతులు పొందే అవకాశం తమకు వస్తుందా..? రాదా..? అనే ఉత్కంఠలో వారు ఉన్నారు. జీహెచ్ఎం పోస్టుల పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తర్వాత స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టుల ఖాళీల సంఖ్యపై స్పష్టత రానుంది. వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 28 పీజీ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందిరానగర్(ఉర్దూ), పాత తాండూరు, మల్‌రెడ్డిపల్లి, హకీంపేట, కుదురుమళ్ల, కొంశెట్‌పల్లి, పట్లూర్, దిర్సంపల్లి, దోమ, బాలంపేట్, మిట్టకోడూర్, అంగడి చిట్టంపల్లి, చెన్‌గోముల్, కరణ్ కోట్, జిన్‌గుర్తి, ధారూరు, వికారాబాద్, మద్గుల్ చిట్టంపల్లి, శివారెడ్డిపేట్, తొరమామిడి(ఉర్దూ),

మిగతా 7వ పేజీలో...

ఆస్పల్లిగూడలో డెయిరీని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్



పశువులకు సకాలంలో వైద్యం అందించాలి

షాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామంలోని విజయ్‌రెడ్డి డెయిరీని ఆయన సందర్శించి పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు. ఆయన వెంట షాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి, రైతులు ఉన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష



ఎరువుల కొరత తలెత్తనీయొద్దు

యాచారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష ఆదేశించారు. శనివారం యాచారం మండల కేంద్రంలోని సొసైటీలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలని సూచించారు. తరచూ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని ఏడీఏ సుజాత, ఏవో రవినాథ్‌లను ఆదేశించారు.

మేడిపల్లిలో సర్వే చేయడానికి వచ్చిన అధికారులు



మూడో రోజు 121ఎకరాల భూసర్వే

యాచారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ కోసం మేడిపల్లిలో సేకరించిన 121ఎకరాల భూమిని శనివారం టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు సర్వేచేశారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి సేకరించిన భూమిని మాత్రమే సర్వే చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని వారు తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా కుసుమ నూనె

కల్తీ లేని కర్త గోల్డ్

తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కుసుమనూనె తయారీ



- హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీలో విక్రయాలు
- విదేశాల్లోనూ క్రేజ్..
- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి
- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో కుసుమ సాగు

Sunday Special

తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఎలాంటి రసాయనాలు, కల్తీ లేకుండా కుసుమ నూనెను తయారు చేసి విక్రయిస్తున్నారు. తాండూరుతోపాటు తెలంగాణలోని అన్ని ప్రాంతాలు, విదేశాల్లోనూ ఈ నూనెకు ఇమేజ్ ఉంది. హైదరాబాద్ వ్యవసాయ యూనివర్సిటీలో ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. కుసుమ నూనెలో కొవ్వును కరిగించే తత్వం ఉంది. ఆవు నెయ్యితో సమానంగా భావించే ఈ నూనెకు 'కర్త గోల్డ్'గా నామకరణం చేసి వ్యవసాయ యూనివర్సిటీ బ్రాండ్‌గా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో కుసుమ పంటను రైతులు అధికంగా పండిస్తారు. తాండూరులో కుసుమ సాగు విస్తీర్ణాన్ని పెంచి తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కుసుమ నూనె తయారీకి గానుగను ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేల ఎకరాల్లో కుసుమ సాగవుతోంది. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కుసుమ నూనెను తయారు చేసి లీటర్‌కు రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ కుసుమ నూనెను హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో అమ్ముతున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల ప్రజలు తాండూరు కుసుమ నూనెను కొనుగోలు చేసేందుకు ఆసక్తి

మిగతా 7వ పేజీలో...

పెన్షన్.. టెన్షన్!

పింఛన్‌దారులకు 'కొత్త' కష్టాలు

- ఫేస్ రికగ్నిషన్‌తో సాంకేతిక సమస్యలు.. యాప్‌లో అప్‌లోడ్ కాని ఫొటోలు
- సైట్ సమస్య అంటున్న పోస్టల్ సిబ్బంది.. ఆందోళనలో పింఛన్‌దారులు
- మంచానికి పరిమితమైన లబ్ధిదారులకు అందని డబ్బులు
- కొత్త యాప్‌లో కనిపించని పంచాయతీ సెక్రటరీల వేలి ముద్రలు
- ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వాల్సిన రూల్స్ లేవంటున్న పోస్ట్‌మెన్‌లు
- అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామంటున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చేయూత పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధానం ద్వారా కొత్త చిక్కులు తలెత్తుతున్నాయి. ఒక్కో లబ్ధిదారు ఫొటోను మిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి 15నిమిషాలకు పైగా సమయం తీసుకుంటుంది. ఒక్కోసారి సైట్ ఓపెన్ కాకపోవడం, నెట్ సిగ్నల్స్ అందకపోవడం, లబ్ధిదారుల ఆధార్ వివరాలు అప్‌డేట్ కాకపోవడం తదితర సమస్యల కారణంగా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా పోస్టల్ సిబ్బంది ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేయకపోవడంతో సెల్‌ఫోన్‌లలో మిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు సరిగా పనిచేయకపోవడం కూడా సమస్యకు కారణమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం ద్వారా జిల్లాలో వృద్ధాప్యం, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, గీతా కార్మికులు, హెచ్ఐవీ,

మిగతా 8వ పేజీలో...



యాచారంలో మహిళను ఫొటో తీస్తున్న తపాల సిబ్బంది

నాకు ఇంకా పింఛన్ రాలేదు



ఇప్పటికే అందరూ పింఛన్ పొందారు. నాకు ఇంకా పింఛన్ రాలేదు. గ్రామ పంచాయతీ సెక్రటరీని అడిగితే.. వేలి ముద్రలు వేసి యంత్రంలో అతని పేరు, వేలి ముద్రలు రావడం లేదంటున్నారు. పోస్టాఫీసు అధికారులు ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వాలి. నాకు నడవానికి చేత కాదు. పోస్టాఫీసుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి నాలాంటి వారందరికీ ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలి. లేదా ఇప్పటి వరకు ఇచ్చిన విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించాలి. – బండారు పెంటారెడ్డి

ప్రమాదంలో దేశ సార్వభౌమత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




జెండావిష్కరణలో కూనంనేని, నాయకులు

మొయినాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) దేశసార్వభౌమత్వం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివ రావు పేర్కొన్నారు. అమెరికాలో ట్రంప్, ఇండియాలో మోదీ విరుద్ధమైన ప్రకటనలతో గందరగోళం ఏర్పడిందన్నారు. శనివారం మొయినాబాద్‌లో సీపీఐ జిల్లా 17వ మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. భారతదేశ ఎగుమతులపై అమెరికా 25శాతం సుంకాలు విధించినా మోదీ నోరు మెదపడం లేదని విమర్శించారు. పహల్గాం ఘటన అనంతరం జరిగిన పరిణామాలతో ఆపరేషన్ సింధూర్‌కు సిద్ధమైన ఇండియాను యుద్ధం చేయకుండా నిలిపి వేశానని అమెరికాలో ట్రంప్ ప్రకటిస్తే, మోదీ మాత్రం విజయం సాధించడానికి నేను పాకిస్తాన్‌ను బెదిరించి లొంగదీసుకున్నానని ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పాలస్తీన నగరం, గాజానగరంపై ఇజ్రాయిల్ దాడిని ఖండించలేని అసమర్థుడు మోదీ అని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో 2026 నాటికి మావోయిస్టులు లేని భారతదేశాన్ని నిర్మిస్తామని మోదీ, అమిత్‌షా అనడం బాధాకరమన్నారు. ఆగస్టు 20 నుంచి 22 వరకు మేడ్చల్‌లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆర్థిక పరిస్థితులపై సమగ్రమైన చర్చ జరుగుతుందని, భవిష్యత్ ఉద్యమాలకు ఆ మహాసభ వేదిక కాబోతున్నదని ఆయన తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నర్సింహా, పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీసీ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు, కే రామస్వామి, కావలి నర్సింహా, కోరుగంటి యాదయ్య, షైమీదా, బుద్దుల జంగయ్య, రామకృష్ణ, ఎం.శ్రీను. నిర్మల, ఎం.ఎరియాస్, నర్సింహా, ఆర్.యాదగిరి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల కార్యదర్శులు కే.శ్రీనివాస్, ఎం.సతీష్‌రెడ్డి, పి.శ్రీశైలం, సుధీర్, విద్యార్థిసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారా క్రాంతి జిల్లాలోని నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడో ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతున్న భారత్

- కరోనా సమయంలో 140కోట్ల మందికి ఉచితంగా కరోనా వ్యాక్సిన్ వేశాం
- 50దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ఘనత ప్రధాన మంత్రిదే
- కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి



ప్రధాని ఉపన్యాసం వింటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రపంచ దేశాలకు పోటీగా నిలుస్తూ మూడో ఆర్థిక అతిపెద్ద దేశంగా భారత్ ఎదుగుతుందని, ఒకనాడు భారతదేశం చాలా వెనకబడ్డ దేశమని చిన్నచూపు చూసిన దేశాలు నేడు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధించిన ఘనత అని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. భారతదేశం దినదినాభివృద్ధి చెందడాన్ని నేడు ప్రపంచ దేశాలకు మింగుడు పడడం లేదన్నారు. ఇతర దేశాలకు రుణాలిచ్చేందుకు భారత్ ఘనత సాధించిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.9కోట్ల70లక్షల మంది రైతుల ఖాతాలో 20.500కోట్ల నిధులను జమ చేసి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఆ దృశ్యాన్ని యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డితో

మిగతా 8వ పేజీలో...

మిత్రుల స్నేహహస్తం
స్ఫూర్తిదాయకం.. యువకుల సంకల్పం
స్నేహం, సహాయం, చేయూత ఫౌండేషన్ ధ్యేయం
సామాజిక సేవల్లో ఆమనగల్లు యువకులు
నేడు స్నేహితుల దినోత్సవం 7

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ 7

ఇచ్చిన హామీని అమలు చేయాలి
దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచే వరకు ప్రభుత్వంపై పోరాటం
ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 6

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భట్టిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సోమశిలలో డిప్యూటీ సీఎంతో కలిసి బోటులో ప్రయాణించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై భట్టి దృష్టికి తీసుకుపోయారు. అభివృద్ధి పనులకు నిధుల కోసం కోరగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



భట్టి విక్రమార్కతో బోటులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

దివ్యాంగులకిచ్చిన హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

చేవెళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ఎన్నికలప్పుడు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల పెన్షన్ ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం చేవెళ్లలోని వేంకటేశ్వర గార్డెన్‌లో చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల వికలాంగులు, పెన్షన్‌దారుల మహాగర్జన సన్నాహక సమావేశానికి మంద కృష్ణ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ... 18ఏళ్లుగా దివ్యాంగుల హక్కుల కోసం, పెన్షన్ పెంపు కోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంచకపోవడం బాధాకరం అన్నారు. ఏపీలో దివ్యాంగుల పెన్షన్ పెంచారని, తెలంగాణలో మాత్రం పెంచలేదన్నారు. దివ్యాంగుల పెన్షన్ పెంపు గురించి ప్రతిపక్షనేత కేసీఆర్ ప్రభుత్వాన్ని అడగడు.. సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయడు అని అన్నారు. ధనిక కుటుంబాల్లో పుట్టిన వీరిద్దరికి పేదలు, దివ్యాంగుల కష్టాలు ఎలా తెలుస్తాయన్నారు. రాష్ట్రంలో 50లక్షల మంది పెన్షన్లపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. పెన్షన్ పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలుచేస్తారో? లేదా రాజీనామా చేస్తారో తేల్చుకుందామన్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభకు దివ్యాంగులు, పెన్షన్‌దారులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి, ప్రవీణ్‌కుమార్, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత వల్లే బాల్య వివాహాలు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

నందిగామ, అగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత వల్లే సమాజంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, చదువుతోనే సమాజం వికసిస్తుందని షాద్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. శనివారం నందిగామలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సీనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న ఆధునిక సమాజంలో విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలపై, బాల్య వివాహాలపై విద్యార్థులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిపితే కఠిన శిక్షలు ఉంటాయని, బాల్యంలో వివాహం చేసుకుంటే పుట్టబోయే పిల్లలు అనారోగ్యంతో ఉంటారని తెలిపారు. బాలికలను ఎవరైనా వేధిస్తే 100 డయల్‌తో పాటు లీగల్ సెల్ అథారిటీ టోల్ ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేయాలన్నారు. చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న విషయాలను గమనించాలని సూచించారు. చదువు ఒక బ్రహ్మాస్త్రం అని, రక్షణ బాటలో మేముంటామని.. బంగారు బాటలో మీరుండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌యాదవ్, న్యాయవాదులు రహీముద్దీన్, నర్సింలు, మనోహర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిక్కడు.. దొరకడు!

- లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులను చూసి పరారైన పంచాయతీ కార్యదర్శి
- సవాలుగా మారిన అతడి అరెస్టు



సురేందర్

షాద్‌నగర్/కొత్తూర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేందర్ అరెస్టు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి సవాలుగా మారింది. ఓ వ్యాపారి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ రాకను గమనించి జూలై 25న పరారైన సురేందర్.. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు పత్తా లేకుండా పోయాడు. కుటుంబంతో సహా ఆచూకీ లేకుండా పోయిన సురేందర్‌ను పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు వారం రోజులుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇన్ముల్‌నర్వలోని ఓ ఇంటి నిర్మాణానికి ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకునేందుకు సురేందర్.. ఓ వ్యాపారిని రూ.లక్ష లంచం అడిగాడు. అడ్వాన్సుగా రూ.50వేలు, పని పూర్తయ్యాక మిగిలిన డబ్బు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నాడు. దీంతో వ్యాపారి దీనిపై ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ సూచన మేరకు ఆ వ్యాపారి రూ.50 వేలిస్తానని సురేందర్‌ను జూలై 25న శంషాబాద్ సమీపంలోని ఇండియానా హోటల్ వద్దకి పిలిచాడు. వ్యాపారి నుంచి రూ.50వేలు తీసుకున్న సురేందర్ ఏసీబీ అధికారుల రాకను గమనించి తన కారులో పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు వెంబండించినా ఫలితం లేకపోయింది. జూలై 26న సురేందర్ ఇంటికి వెళ్లిన ఏసీబీ అధికారులు అతడి కారు, రూ.50 వేల నగదును సీజ్ చేశారు. నాటి నుంచి సురేందర్ జాడ లేకపోగా, అతడిని అదుపులోకి తీసుకోవాలని ఏసీబీ అధికారులు గాలిస్తున్నారు. సురేందర్, తన కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. ఆయా ప్రాంతాలకు వెళ్లేసరికి అక్కడి నుంచి పరారవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరోపక్క, ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన సురేందర్.. ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తోడ్పాటు

కడ్తాల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని చెప్పారు. కడ్తాల మండలంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రావిచెడ్‌లో అనారోగ్యంతో మృతిచెందిన కృష్ణయ్యగౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రూ.5వేలు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.6వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు శ్రీనివాస్, జనార్ధన్‌గౌడ్, పారేశ, రమేశ్‌గౌడ్, రూపేందర్, రాంచందర్, రాజు, యాదయ్య, ప్రభాకర్, శరమంద ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కీసర, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కీసరకు చెందిన గుర్రం లక్ష్మారెడ్డికి శనివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గుండె సమస్యతో చికిత్స పొందిన లక్ష్మారెడ్డి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వైద్య ఖర్చులకు 1.3లక్షలు మంజూరు కాగా, వజ్రేశ్ తన నివాసంలో చెక్కును అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డికి చెక్కును అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

కల్తీ లేని కర్త గోల్డ్



కుసుమ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

(ఐదో పేజీ తరువాయి)

చూపుతున్నారు. ప్రతి నెలలో తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో డిమాండ్ బట్టి 500లీటర్ల నుంచి వెయ్యి లీటర్ల వరకు కుసుమ నూనె తయారు చేస్తున్నారు. పరిశోధన కేంద్రంలో గత అక్టోబర్‌లో కుసుమ పండించి గానుగాడించి నూనెను తయారు చేస్తున్నారు. కుసుమ నూనెలో గుండె జబ్బుల నివారణ, కొవ్వును కరిగించే తత్వం ఉంది.

కుసుమ నూనెతో ప్రయోజనాలు మెండు

విటమిన్ 'ఈ' అధికంగా ఉండే కుసుమ నూనెతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ చెప్పారు. పూర్వం కుసుమ నూనెను శిశువులకు మర్దనకు, వృద్ధుల మోకాళ్ల నొప్పులకు వాడేవారు. ఇక్కడి కుసుమ నూనెకు అమెరికాలోనూ డిమాండ్ ఉంది. గానుగాడించిన ఈ నూనెను వివిధ రకాల ముందుల తయారీకి వాడుతున్నట్లు పేర్కొన్నారు. క్వింటాలు కుసుమలకు 20కిలోల నూనె వస్తుందని గానుగ నిర్వాహకులు చెబుతున్నారు.

పదోన్నతుల పండగ!

(ఐదో పేజీ తరువాయి)

కొత్తపల్లి, చౌడాపూర్, ఇప్పాయిపల్లి, పుట్టపహాడ్, ఎక్మామిడి, చీమల్‌దరి, మొరంగపల్లి, కొడంగల్, దేవనూర్, యాలాల్, మైల్వార్‌లో ఖాళీలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో అల్వాల్-2, బహదూర్‌పల్లి, దూలపల్లి, అన్నోజిగూడ, కాప్రా, కుషాయిగూడ, బోగారం, కీసర, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, నేరేడ్‌మట్, గుండ్లపోచంపల్లి, గురుమూర్తినగర్, జీడిమెట్ల, సూరారం, పొన్నాల్, తూంకుంట, తుర్కపల్లి, మల్లాపూర్, కొత్తపేట, ఉద్దెమర్రి, ఆర్టీ రామంతాపూర్ పాఠశాలల్లో పీజీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోని పెద్ద అంబర్‌పేట్, కుంట్లూర్, బడంగ్‌పేట్, మొగిలిగిద్ద,నార్సింగి, ఇబ్రహీంపట్నం(ఉర్దూమీడియం-బాలికలు),శేరిగూడ, ఆకుల మైలారం, పెంజర్ల, ఆరుట్ల, అజీజ్‌నగర్, బాకారం, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, కనకమామిడి, చందానగర్, నర్సప్పగూడ, శివరాంపల్లి, శేరిలింగంపల్లి, మహరాజ్‌పేట్, పొద్దటూర్, మహాలింగపురం,శంకర్‌పల్లి, తలకొండపల్లి, చుక్కాపూర్ హైస్కూళ్లలో పీజీహెచ్‌ఎం పోస్టులు వేకెన్సీ ఉన్నాయి.

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు సీనియర్ ఎస్జీటీల సర్వీస్ రిజిష్టర్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లను శనివారం పరిశీలించారు. జనరల్ విభాగంలో 2006 డీఎస్సీ వరకు నియామకమైన ఎస్జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఎస్సీ విభాగంలో 2012, ఎస్టీ విభాగంలో 2017, పీహెచ్‌సీ విభాగంలో 2017 డీఎస్సీ ఎస్జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్, ఫిజికల్ సైన్స్) పదోన్నతులకు వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగగా, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ, స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రమోషన్లకు బాలికల ఉన్నత పాఠశాలలో పరిశీలన చేశారు. ఎస్ఏ మ్యాథ్స్, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు జడ్పీ పాఠశాలలో, ఎస్ఏ సోషల్, ఫిజికల్ ఎడ్యుకేషన్(ఫిజికల్ డైరెక్టర్) పోస్టులకు జెడ్పీ బాలికల పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది.

ఖాళీల్లో 70శాతం పదోన్నతులతోనే భర్తీ...

వికారాబాద్ జిల్లాలో అన్ని కేడర్లలో కలిపి 428 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో 31 పీజీ హెచ్‌ఎం పోస్టులు, 125 స్కూల్ అసిస్టెంట్, తత్సమాన హోదా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. వేకెన్సీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 70:30 నిష్పత్తితో భర్తీ చేస్తారు. ఖాళీల్లో 70శాతం పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయనుండగా, 30 శాతం పోస్టులను డీఎస్సీ నిర్వహించి భర్తీ చేయనున్నారు.

శిశువులకు తల్లిపాలు పట్టించాలి



సీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమావేశమైన సీడీపీవో వినితాదేవి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పుట్టిన గంటలోనే పిల్లలకు తల్లిపాలు పట్టించాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో వినితాదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలో సీహెచ్‌సీతోపాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆరు నెలలపాటు పిల్లలకు తల్లిపాలు తప్ప ఎలాంటి ఆహారం ఇవ్వొద్దన్నారు. తల్లిపాలతోనే పిల్లల్లో ఎదుగుదల, మేధస్సు అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తల్లిపాల కార్నర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జంగయ్యగౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పల్లవి, అరుణ, కల్పన, విద్యుల్లత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలూరులో తల్లిపాల వారోత్సవాలు



శిశువుకు ఆహారం తినిపిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

మహేశ్వరం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):శిశువుకు తల్లి పాలు ఎంతో ప్రాధాన్యమైనవని, పుట్టిన గంటలోనే పిల్లలకు పాలు పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తుమ్మలూరులో గర్భిణులు, బాలింతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లి పాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తల్లిపాలు తాగేపిల్లలు విరోచనాలు, న్యుమోనియా తదితర వ్యాధులనుంచి రక్షణ పొందుతారన్నారు. అధిక బరువు, మధుమేహం వంటి సమస్యల నుంచి పిల్లలను కాపాడుతాయన్నారు. తల్లి పాలు పడితే పిల్లలకు మేధోశక్తి పెరుగుతందన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు రెండేళ్ల నిండే వరకు తల్లిపాలు తప్పక పట్టించాలన్నారు. ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు అదనపు పోషకాహారం ఇవ్వాలని బాలింతలకు సూచించారు. డబ్బా పాలు పట్టి పిల్లల ఆరోగ్యాన్ని పాడుచేయొద్దన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో వైద్య శిబిరం



బాలికకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు గోపాల్

బషీరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. నవాల్గ పీహెచ్‌సీ వైద్యుడు గోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థినులకు వైద్య చికిత్సలు చేశారు. సీజనల్ వ్యాధులు, జ్వరం, తలనొప్పి, అలర్జీ, దగ్గు, రక్తహీనత వంటి వాటితో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యులు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం శ్రీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ అభిషేక్, ఆశ వర్కర్లు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరులో చెట్ల నరికివేత

● వాల్టా చట్టం ఉల్లంఘన



మునిసిపాలిటీలో నరికివేసిన చెట్లు

తాండూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చెట్ల సంరక్షణ బాధ్యత మనదేనని గొప్పలు చెప్పే మున్సిపల్ అధికారులు చట్టానికి విరుద్ధంగా చెట్లను నరికివేయించారు. శనివారం తాండూరు మున్సిపల్ కొత్త భవనం వెనుక ఉన్న స్త్రీ శక్తి భవనం, వాటర్ ట్యాంక్ వద్ద చెట్లను ప్రైవేట్ వ్యక్తులు నరికేశారు. కమిషనర్ చెప్పడంతోనే ఈ చెట్లు నరికినట్టు కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. దాదాపు 20చెట్లను నరికివేశారు. అటవీ లేదా రెవెన్యూ శాఖల అనుమతి తీసుకోకుండా నరికించేశారు. ఈ విషయంలో అధికారులను ఆరా తీయగా తమకేమి సమాచారం లేదని చెబుతున్నారు. ఈ చెట్లను కొట్టే బాధ్యతను కమిషనర్ ఓ రిటైర్డ్ ఉద్యోగికి అప్పగించినట్లు సమాచారం. లక్షన్నర విలువైన చెట్లను ఇష్టానుసారం నరికివేశారు. దీనిపై ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ డీఈ మణిపాల్‌ను వివరణ కోరగా.. చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించాలని కాంట్రాక్ట్ ఇచ్చామని, అయితే మొదళ్లను కూడా నరికి ఉంటారని ఆయన చెప్పారు. నరికిన చెట్లను మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. అనుమతి తెచ్చుకున్న తర్వాత కలప తీసుకెళ్లాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాండూరు మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఉన్న అదనపు కలెక్టర్ దృష్టికి గానీ, అనుమతి తీసుకోకుండానే మున్సిపల్ అధికారులు సొంత నిర్ణయంతో చెట్లు నరికివేయించినట్లు తెలుస్తోంది.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

నవాబుపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ వెంకటేశం హెచ్చరించారు. శనివారం నవాబుపేటలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పక ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటేశం

మిత్రుల స్నేహహస్తం

● స్ఫూర్తిదాయకం.. యువకుల సంకల్పం
● స్నేహం, సహాయం, చేయూత ఫౌండేషన్ ధ్యేయం
● సామాజిక సేవల్లో ముందుకు పోతున్న ఆమనగల్లు యువకులు

నేడు స్నేహితుల దినోత్సవం



స్నేహహస్తం ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో కష్టాలను ఈదిన వారు. నిరుపేద కుటుంబాల వారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వీరంతా సమాజ సేవకు సంకల్పించారు. పేద పిల్లలకు చేయూతనిచ్చేందుకు నడుంబిగించారు. సేవా సంస్థను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఈ మిత్ర బృందం సంకల్పం, కార్యదీక్ష ఆమనగల్లు ప్రాంతంలో ప్రశంసలందుకుంటోంది.

1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సంకల్పం

ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన 1994-95బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాల విద్య పూర్తయిన తరువాత యేటా ఏటా ఏదో సమ్మేళనాన్ని నిర్వహించుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు. 20ఏళ్లపాటు 107 మంది స్నేహితుల కళయిక కొనసాగింది. వారిలో చాలా మంది వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు తమవంతు చేయూతనందించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ఆమనగల్లుకు చెందిన గజ్జె చలమంద రాజు కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజు సంకల్పానికి తోటి మిత్రులంతా సహకరించారు.

లక్ష్యం కోసం స్నేహహస్తం ఫౌండేషన్ ఏర్పాటు

ఈ పూర్వ విద్యార్థులు 8 జనవరి 2017లో ఆమనగల్లులో సమావేశమయ్యారు. సేవా కార్యక్రమాలకు 'స్నేహహస్తం' పేరుతో ఫౌండేషన్‌ను స్థాపించారు. స్నేహం, సహాయం, చేయూతలే ధ్యేయంగా ఎస్‌హెచ్ఎఫ్ లోగోను ఆవిష్కరించారు. ప్రతీ కార్యక్రమానికి సభ్యులంతా సమావేశమయ్యేలా తీర్మానించారు. ఫౌండేషన్‌లో ప్రస్తుతం 80 మంది సభ్యులున్నారు. కార్యక్రమాల నిర్వహణకు 20 మందితో కమిటీ వేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా చలమంద రాజు, అధ్యక్షుడిగా తల్లోజు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గుంపెని శ్రీను, జహంగీర్, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.మహేశ్, పెరకేటి యాదయ్య, కోశాధికారి లింగంపల్లి ఆనంద్, రమేశ్, జగదీశ్, శ్రీను, రాంపాల్, చంద్రశేఖర్, పున్న వెంకటేశ్, జి.సూర్యప్రకాశ్, వెంకట్‌రెడ్డి, నర్సింహ, నిరంజన్, ప్రభాకర్‌రెడ్డి, సత్యం సభ్యులుగా ఉన్నారు. వీరు రెండు మూడు నెలలకోసారి సమావేశమై సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మిత్రులంతా నెలనెలా తలా కొంత ఫౌండేషన్‌కు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల్లో పెద్దగా చదువుకోని, వివిధ వృత్తుల్లో జీవనం సాగిస్తున్న వారు సైతం వీలైనంత డబ్బును ఫౌండేషన్‌కు అందిస్తున్నారు.

చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇవీ..

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇప్పించి వివిధ రంగాల్లో ఉద్యోగ కల్పనకు చేయూత నిస్తున్నారు. 2022లో పోలీసు నోటిఫికేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన 70 మంది యువతకు కానిస్టేబుల్ శిక్షణ ఇప్పించగా వారిలో 10మంది ఉద్యోగాలు సాధించారు. ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన వారికి డీసీపీ శ్రీనివాస్ ద్వారా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

❑ ఆమనగల్లు మండలం చింతలపల్లికి చెందిన చుక్క రాములుగౌడ్-దంపతులు అనారోగ్యంతో చనిపోయారు. వారి పిల్లలు చందనశ్రీ, భానుశ్రీ, అభినవ్‌లకు రూ.20వేల సాయం అందజేశారు. ఏటా వంద మంది వరకు పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నారు. ఆమనగల్లులోని బాలుర, బాలికల, బస్టాండ్ హైస్కూళ్ల విద్యార్థుల్లో వార్షిక పరీక్షల్లో టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తున్న వారికి నగదు ప్రోత్సాహకం, షీల్డ్‌లను బహూకరిస్తున్నారు. 2017లో ఆమనగల్లు శివాలయం కాలనీకి చెందిన సుధాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం రూ.18,550 అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటేలా కృషిచేస్తున్నారు. ఏటా వెయ్యి మొక్కలు నాటి సంరక్షించేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నారు. మూఢ నమ్మకాలను రూపుమాపి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్తదాన శిబిరాల్లో ఫౌండేషన్ సభ్యులు విరివిగా రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



అనాథ పిల్లల చదువుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యం



నిరుపేద కుటుంబానికి చెందిన నేను చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డా. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికి రాకూడదని మా పూర్వ విద్యార్థులమంతా సమావేశమై స్నేహహస్తం ఫౌండేషన్ స్థాపించాం. పేద విద్యార్థులకు విద్యాపరంగా సహాయమందించి వారిని ప్రయోజకులను చేయడం ద్వారా ఆ కుటుంబం బాగుపడుతుందన్నది మా సంకల్పం. సీఐగా విధులు నిర్వహిస్తున్న నేను సేవా కార్యక్రమాలకు సహాయమందిస్తున్నా. విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనే ఫౌండేషన్ లక్ష్యం.

- గజ్జె చలమంద రాజు,వ్యవస్థాపక అధ్యక్షుడు,స్నేహహస్తం ఫౌండేషన్

ప్రతిభ ఉన్న వారికి ప్రోత్సాహం



చదువు, ఉద్యోగ సాధనకు పేదరికం అడ్డుకాకూడదన్నదే ఫౌండేషన్ ధ్యేయం. అందుకే ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న విద్యార్థుల ఉన్నత చదువుకు చేయూతనందిస్తున్నాం. ప్రతి యేటా పదో తరగతిలో ప్రతిభ కనబరుస్తున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు అందజేస్తున్నాం. స్నేహితులం తలాకొంత డబ్బు పోగుచేసుకొని ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిరాఘాటంగా కొనసాగిస్తున్నాం. ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహాన్ని ఇచ్చాం.

- తల్లోజు చంద్రశేఖర్, అధ్యక్షుడు, స్నేహహస్తం ఫౌండేషన్

సామాజిక ప్రయోజనం కోసం...



సామాజిక సేవ, ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. ఏటా ఓ అడుగు ముందుకేస్తూ మా సేవలను విస్తృతం చేస్తున్నాం. ప్రజా చైతన్య కార్యక్రమాల్లోనూ మా వంతుగా పాలుపంచుకుంటున్నాం. మా జీవితాల్లో ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి చేయూతనందిం చేందుకు సంకల్పించాం. ఫౌండేషన్ ద్వారా విద్య, రక్తదానం శిబిరాలు, పచ్చదనం, పరిశుభ్రత, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం.

- పెరికేటి యాదయ్య, ప్రధాన కార్యదర్శి, స్నేహహస్తం ఫౌండేషన్

కాంగ్రెస్‌ది జనహిత పాదయాత్ర

● సీఎం రేవంత్‌రెడ్డి సీటు పోవడం ఖాయం
● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్
● ఏం వెలగబెట్టారని పాదయాత్ర?
● పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి

పరిగి,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్‌ది జనహిత పాదయాత్ర కాదు.. ప్రజాహిత పాదయాత్ర అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ విమర్శించారు. శనివారం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వారు చేసింది హైవేపై హంగామా అని, పెళ్లి బారాత్ లెక్క ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలను సావగొడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలన అట్టర్ ఫ్లాప్ అని, పాలన చేతకాకే యాత్ర చేపట్టారని హేళన చేశారు. సీఎంకు, మీనాక్షీనటరాజన్‌ల మధ్య సమన్వయం లేదన్నారు. కేసీఆర్ మిషన్ భగీరథ అయితే, కాంగ్రెస్‌ది మిషన్ మీనాక్షి అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి 20 నెలల్లో 50 సార్లు ఢిల్లీకి వెళ్లి ఉంటారని, అక్కడ రాహుల్ కంటే, బీజేపీ వారినే ఎక్కువసార్లు కలిశాడన్నారు. రేవంత్‌రెడ్డి సీటు ఊస్టింగ్ ఖాయమన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపై ఒక్కసారైనా మోదీతో సీఎం మాట్లాడారా? అని ప్రశ్నించారు. బీసీలు కాంగ్రెస్‌ను నమ్మడం లేదన్నా రు. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏం వెలగబెట్టారని పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. బనకచర్ల విషయంలో కాంగ్రె స్, బీజేపీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు 80శాతం పూర్తయ్యాయని, ఐదు రిజర్వాయర్లు కట్టామని, కాలువల పనులే మిగిలాయన్నారు. వాటికి రూ.ఆరు వేల కోట్లతో పనులు చేసేందుకు టెండర్లకు కాల్‌ఫర్ చేయగా అంతలోనే ప్రభుత్వం మారిందని తెలిపారు. గ్యారంటీలు, 420 హామీల అమలు చేతకాకే స్థానిక ఎన్నికల కోసం నాటకానికి తెరలేపారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా చెల్లింపుల్లో విఫలయ్యారన్నారు. రుణమాఫీకి రూ.49వేల కోట్లు కావాలని వారే చెప్పి.. ఇప్పటి వరకు రూ.20వేల కోట్లే మాఫీ చేశారన్నారు. రెండు సార్లు రైతుభరోసా ఎగ్గొట్టారని తెలిపారు. సమావేశంలో పరిగి ప్యాక్స్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేశం, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.అంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, పి.రాజు, మల్లేశం, టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యస్థాపనే ప్రభుత్వ లక్ష్యం



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపనే సీఎం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతాప్‌సింగారంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారీగా అందరికీ ఇళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో కుమార్, కీసరగుట్ట ఆలయ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌గౌడ్, అబెదాబేగం, చంద్రమౌళి, బాలరాజు, ఎన్.కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు అండగా లియాఫి పోరాటం



అరుణకు చెక్కును ఇస్తున్న లియాఫీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ ఏజెంట్ల హక్కుల సాధన కోసం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫి) నిరంతరం పోరాటాలు చేసి, అండగా నిలిచిందని లియాఫి డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద ఓ హోటల్‌లో శనివారం జడ్చర్ల, షాద్‌నగర్ లియాఫి ఈసీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏజెంట్ల హక్కుల సాధనతో పాటు ఉన్న సౌకర్యాల పరిరక్షణకు పోరాటాలు చేస్తోందన్నారు. 1956లో ఎల్ఐసీ ఆవిర్భవిస్తే 1964లో లియాఫి ఏర్పాటైందన్నారు. ఏజెంట్లకు యాజమాన్యం నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. అన్నీ తామే చేశామని ఇటీవల బీఎంఎస్ చేస్తున్న ప్రచారాన్ని ఏజెంట్లు నమ్మొద్దని కోరారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి సుదర్శనం మాట్లాడుతూ.. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఏజెంట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివిజన్ కోశాధికారి జి.శ్రీనయ్య మాట్లాడుతూ.. ఏజెంట్ల కోసమే పనిచేస్తున్న సంస్థ లియాఫి అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏజెంట్ బి.యాదగిరి భార్య అరుణకు లియాఫి తరఫున రూ.25వేల చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో లియాఫి షాద్‌నగర్ అధ్యక్షుడు కాట్న రాంచంద్రయ్య, జడ్చర్ల అధ్యక్షుడు శోభన్‌బాబు, యాదవచారి, శ్రీహరిగౌడ్, ఎల్.మోహన్‌రెడ్డి, సి.వెంకటయ్య, చంద్రశేఖర్‌గౌడ్, రాజుగౌడ్, సాయిరెడ్డి, మజార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మోమిన్‌పేట్‌లో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్, ఉపాధి హామీ, మహిళా సమాఖ్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రణీత్, శంకరయ్య, మధుకర్, రాజు, వికాస్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్, మానెయ్య, ఎజాజ్ పాషా సోమారపు రవి తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రోగులతో మాట్లాడుతున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్

చేవెళ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆయన కలియ తిరిగి విభాగాలను పరిశీలించారు. ఆసుత్రిలో చేరిన రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. రోగులకు కావాల్సిన మందులన్నీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసు పత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమయానుకులంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. విధుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. తనిఖీలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

దైవ కార్యక్రమాలతో సమాజంలో శాంతి


పూజలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో శనివారం సుంకిరెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లింగసానిపల్లిలో పునర్ నిర్మాణంలో ఉన్న శివ, రామాలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సుంకిరెడ్డిని ఆలయ నిర్వాహకులు సత్కరించి అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు రాములు, శేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు, సత్యం, శ్రీనివాసాచారి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీకి మిషన్ భగీరథ నీరు అందించాలి


మాట్లాడుతున్న పాషా

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు విద్యానగర్ కాలనీకి మిషన్ భగరథ నీరు అందించాలని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా కోరారు. నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అనారు. శనివారం పాషా విలేఖరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం పైపులైన్ నిర్మాణం చేసి కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు సైతం వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని పాషా తెలిపారు. నాయకులు రాములు, అంకయ్య, మల్లయ్య, రఘుమాచారి, సిరాజ్ తదితరులున్నారు.

పెన్షన్.. టెన్షన్!

(ఐదో పేజీ తరువాయి)

డయాలసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మొత్తం 1,96,264 మందికి ప్రతి నెలా రూ.47.78 కోట్లు ప్రభుత్వం పింఛన్ రూపంలో పేదలకు అందిస్తుంది. అత్యధిక పింఛన్లు సరూర్‌నగర్, రాజేంద్రనగర్‌లోనే ఉన్నాయి. రాజేంద్రనగర్ మండలంలో అత్యధికంగా 14,559 పింఛన్లు అందిస్తుండగా సరూర్‌నగర్ మండలంలో 12,155 పింఛన్లు అందిస్తున్నారు. బోగస్ పింఛన్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులకు ఫేస్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అర్హులకే పింఛన్లు అందించాలనే ఉద్దేశంతో దీనిని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గత నెల 29 నుంచి పింఛన్‌దారుల కోసం ఫేస్ రికగ్నిషన్ నమోదు ప్రక్రియను ప్రారంభించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థను ఆదేశించింది. ప్రతి నెలా పింఛన్ ఇచ్చే సమయంలో వృద్ధాప్యం కారణంగా వేలి ముద్రలు పడక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫింగర్ ప్రింటు పడని వారికి పంచాయతీ సెక్రటరీలు, పోస్టుమాస్టర్, బిల్ కలెక్టర్లు ధ్రువీకరించిన తర్వాత పింఛన్ ఇస్తున్నారు. ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదుచేసి ప్రతి నెలా వారి ఫొటో తీసి మిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే పింఛన్ జారీ చేయాల్సి ఉంటుంటుంది. ఒక్కో లబ్ధిదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి 15 నిమిషాలకు పైగా సమయం తీసుకుంటుంది. ఒక్కోసారి సైట్ ఓపెన్ కాకపోవడం, నెట్ సిగ్నల్స్ అందకపోవడం, లబ్ధిదారుల ఆధార్ వివరాలు అప్‌డేట్ కాకపోవడం వంటి సమస్యల కారణంగా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా పోస్టల్ సిబ్బంది ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేయకపోవడంతో సెల్‌ఫోన్‌లలో మిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధిదారుల ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు సరిగా పనిచేయకపోవడం కూడా సమస్యకు కారణమవుతోంది.

పింఛన్ రకం	వివరాలు
వృద్ధాప్యం	76,875
వితంతు	82,732
వికలాంగులు	26,707
ఒంటరి మహిళా	6,420
చేనేత కార్మికులు	810
బీడీ కార్మికులు	14
కల్లు గీత కార్మికులు	2,315
డయాలసిస్	334
ఫైలేరియా	57

ఆందోళనలో పింఛన్‌దారులు

అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమైన వృద్ధులు పింఛన్ కోసం టెన్షన్ పడుతున్నారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పోస్టాఫీసుకు వెళ్లి వేలి ముద్ర వేసి పింఛన్ తీసుకుని ఇంటింటికీ వెళ్లి ఇచ్చేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధానంతో మంచానపడిన ఉన్న లబ్ధిదారులు పింఛన్ కోసం ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వేలి ముద్ర తొలగించడంతో మంచానికి పరిమితమైన వారికి పింఛన్ ఇవ్వలేకపోతున్నారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పోస్టాఫీసులో అధికారి రాఘవేందర్ పింఛన్ల కోసం పోస్టాఫీసుకు వెళ్లగా, అక్కడ యంత్రంలో ఆయన వేలి ముద్రలు కనిపించలేదు. దీంతో ఆ అధికారి వెళ్లిపోవడంతో.. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులంతా తమకు పింఛన్లు వస్తయో... రావోనని బెంబేలెత్తారు. ఇంటింటికీ వెళ్లి ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి పింఛన్ ఇవ్వాల్సిన పోస్టాఫీసు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో చేవెళ్ల పోస్టాఫీసు అధికారి సంతోష్‌ను వివరణ కోరగా.. ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వాలనే రూల్స్ లేవని తెలిపారు.

అందరికీ పింఛన్లు ఇస్తాం



పింఛన్లు రాలేదని ఆందోళన చెందవద్దు. గత నెల పింఛన్ పొందిన వారందరికీ అందజేస్తాం. ఇంటివద్దే ఉండి, మంచానికి పరిమితమైన లబ్ధిదారులకు కార్యదర్శులతో పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమాలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ విధానం ప్రవేశ పెట్టింది.

- శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

● చేపల వేటకు వెళ్లి వ్యక్తి దుర్మరణం

కేశంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేశంపేట మండలం సంతాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యాలాల రామచంద్రయ్య-వెంకటమ్మ దంపతుల కుమారుడు రాకేష్(38) శనివారం మద్యం సేవించి అతడి స్నేహితుడు శ్రీనుతో కలిసి గ్రామ సమీపంలోని నాగుల చెరువులో చేపల వేటకు వెళ్లారు. రాకేష్ చెరువులో మునిగిపోయాడు. శ్రీను, వెంకటేష్, నర్సింలు రాకేష్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడు రాకేష్ తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

కుక్క అడ్డురావడంతో బైకిస్ట్..

మహేశ్వరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సిరిగిరి పురం గ్రామానికి చెందిన తడకల బాలకృష్ణ(40) దినసరి కూలీ. వ్యక్తిగత అవసర నిమిత్తం శనివారం సాయంత్ర సిరిగిరిపురం నుంచి తుక్కుగూడకు బైక్‌పై వెళ్లి వస్తుండగా సిరిగిరిపురం గేటు సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోగా తీవ్ర గాయాలై బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేసున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

యాచారం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కిందపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. యాచారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శివ జూలై 29న తన భార్య సుజాతతో కలిసి బైక్‌పై గున్‌గల్ వైపు వెళుతున్నాడు. ఈక్రమంలో మండల కార్యాలయం సమీపంలో సుజాత బైక్‌పై నుంచి జారి కిందపడింది. పోలీసులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మరణించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను ఏసీపీ కేపీవీ రాజు పరామర్శించి హెడ్‌కానిస్టేబుల్ శివను ఓదార్చారు.

బైక్ దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

శంకర్‌పల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోలీసులు బైక్ దొంగను అరెస్టుచేసి శనివారం రిమాండుకు తరలించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. శంకర్‌పల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో సమ్మయ్య బైకు గత నెల 26న ఇంటి ముందు పార్క్ చేశాడు. గుర్తు తెలియని బైక్‌ను తీసుకెళ్లారు. సమ్మయ్య ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్లోళ్ల రాజేశ్వర్‌రెడ్డి బైక్‌ను దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. చేవెళ్ల కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కేసులో మహిళ అరెస్ట్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కేసులో ఓ మహిళను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన శనివారం ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. చెన్నైకి చెందిన రెనే జోషిదా(30) కొన్నిరోజులుగా దేశంలోని 12రాష్ట్రాల్లో 21సార్లు పలు విమానాశ్రయాలు, విమానాల్లో బాంబు ఉందని బెదిరించింది. దాంతో గుజరాత్‌లోని అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కూడా పలుమార్లు బాంబు ఉందని మెయిల్ చేసింది. ఆర్జీఐఏ పోలీసులు గుజరాత్ నుంచి ఆమెను క్రైంబ్రాంచ్ పోలీసుల ద్వారా అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రతో పాటు మరిన్ని రాష్ట్రాల్లో బాంబు బెదిరింపు కేసులు నిందితురాలిపై ఉన్నాయని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిరిండియా విమానం క్రాష్ కావడానికి కారణం నేనేనంటూ తన బాయ్‌ఫ్రెండ్ పేరుమీద మెయిల్స్ పంపించిందని, త్వరలో కస్టడీకి తీసుకొని మరింత విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

హై అలర్ట్.. ముమ్మరంగా తనిఖీలు

పంద్రాగస్టును పురస్కరించుకుని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైఅలర్ట్ ప్రకటించారు పోలీసులు ఉన్నతాధికారులు. ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉందని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం నుంచి ఈనెల 30వరకు హైఅలర్ట్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, జీఎంఆర్ రక్షా సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాంబు, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిసున్నారు. పాసులను రద్దు చేశారు.

షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
● బల్దియాలో జనహిత పాదయాత్ర


షాద్‌నగర్ : స్థానికులను సమస్యలు అడిగి నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం జనహిత పాదయాత్రలో భాగంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల షాద్‌నగర్ మున్సిపాలిటీ పెద్దగా అభివృద్ధికి నోచుకోలేకపోయిందన్నారు. కాగా, విద్యుత్తు, అంతర్గత రోడ్లు, తాగునీరు, తదితర సమస్యలపై కాలనీల వాసులు ఫిర్యాదు చేశారని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీ సత్యనారాయణ, ఏఈ వినోద్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ

షాద్‌నగర్ పట్టణ మున్సిపాలిటీ 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 166 మంది మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే శంకర్ కిట్లను అందజేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 29 వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. వచ్చే మూడేళ్లలో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, ఇంటింటికీ తాగు నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దసరా సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రూ.2,500 బోనస్ అందజేస్తామని ప్రకటించారు. అనంతరం పట్టణంలోని మల్లికార్జున కాలనీలో రూ.40లక్షలతో ఏర్పాటు చేయనున్న పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. కమిషనర్ సునీత, ఏఎంసీ వైస్‌చైర్మెన్ బాబర్ ఖాన్, సీనియర్ నాయకులు చెన్నయ్య, బస్వం, చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం.. చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కేశంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో ఇంటిని నిర్మిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కేశంపేట మండలం పుట్టవానిగూడ గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలి వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పట్నం శేఖర్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని తెలిపారు. స్థలం ఆక్రమణతో పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆడుకోవడానికి స్థలం లేకుండా పోయిందని వివరించారు. దాంతో ఎమ్మెల్యే విచారణ జరిపిస్తామని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో జగన్, రఘు, రాజునాయక్, శ్రీశైలం, శ్రీను, న ర్సింలు, నారాయణ, శివలింగం, తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



శంషాబాద్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ప్రకాశ్‌గౌడ్ కుటుంబ సభ్యులను శ్రీవారి శేషావస్త్రంతో సత్కరించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కేశంపేట విద్యార్థికి హెచ్‌సీయూలో సీటు


నరేందర్

కేశంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ)లో కేశంపేట మండలం కొనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి సత్తయ్య-సుగుణమ్మ దంపతులు కుమారుడు నరేందర్‌కు ఆంత్రోపాలజీ విభాగంలో సీటు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధించాడు. కాగా, హెచ్‌సీయూలో ఆంత్రోపాలజీ విభాగంలో 40 సీట్లు ఉండగా ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం ఐదుగురు ఎంపికయ్యారని, అందులో తాను కూడా ఒకరినని, జూలై 31న కోర్సులో చేరినట్లు తెలిపారు.

హనుమాన్ ఆలయాన్ని తొలగించొద్దు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 2(ఆంధ్యజ్యోతి): హనుమాన్ ఆలయాన్ని తొలగించొద్దని భజరంగ్‌దళ్ మండల కమిటీ సభ్యులు అన్నారు. మున్సిపల్ పరిధి ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లేఅవుట్ చేస్తోంది. అయితే, ఎన్కేపల్లి సమీపంలో పురాతన హనుమాన్ దేవాలయం ఉంది. దీనిని తొలగించి ఇతర ప్రదేశంలోకి తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం తెలుసుకున్న భజరంగ్‌దళ్ మండల కమిటీ సభ్యులు అక్కడికి చేరుకొని ఆలయాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ అక్కడే దేవాలయానికి భూమి కేటాయించాలని మొయినాబాద్ మండల భజరంగ్‌దల్ ప్రముఖ్ విజయపాండు డిమాండ్ చేశారు. సభ్యులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. గోరక్ష ప్రముఖ్ శ్రీను, సురక్ష ప్రముఖ్ శివకుమార్, విద్యార్థి ప్రముఖ్ సాయి, బలప్రాసన ప్రముఖ్ శివ, సాయి యాదవ్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


కొత్తూర్ : చెక్కులు అందిస్తున్న సుదర్శన్‌గౌడ్

కొత్తూర్/నందిగామ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని పలువురు నిరుపేదలకు మంజూరైన రూ.6లక్షల 35వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సుదర్శన్‌గౌడ్ శనివారం అందజేశారు. కొత్తూర్ మాజీ సర్పంచ్ జెనిగె జగన్, నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, పీర్లగూడెం మహేష్‌గౌడ్, భరత్, చిల్కమర్రి నర్సింహ, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం సహాయనిధి పేదలకు వరం అని కాంగ్రెస్ పార్టీ నందిగామ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు అన్నారు. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిల్లో చికిత్స పొందాడు. ఆయనకు మంజూరైన రూ.18వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కుటుంబసభ్యులకు స్థానిక నాయకులతో కలిసి జంగ నర్సింలు అందజేశారు. జిల్లెల్ల రాంరెడ్డి, జిల్లెల్ల బాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, చాకలి నర్సింలు, రాజగోపాల్, కె.వెంకట్‌రెడ్డి, అబ్దుల్ ఘణి, రాములు, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కడ్తాల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా జరుపుకోవాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మైసిగండి గ్రామంలో శనివారం వినాయక ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహణపై చర్చించారు. గతేడాది మైసిగండి పెద్ద వినాయకుడి లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న జాటావత్ రమేశ్ రూ.3.50 లక్షల చెక్కును ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ తులసీ రామ్‌నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు హీరాసింగ్ నాయక్, జవహర్‌లాల్ నాయక్, రెడ్యనాయక్,యాదగిరి, రాందాస్ నాయక్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మూడో ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకుపోతున్న భారత్

(ఐదో పేజీ తరువాయి)

కలిసి కిషన్‌రెడ్డి తిలకించారు. ప్రధానమంత్రి ఉపన్యాసం ముగిసిన అనంతరం ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. దేశఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని కొందరు ప్రభుత్వంపై నిందలేయడం విడ్డూరంగా ఉందని ఆయన కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. దేశంలోని అనేక గ్రామాలకు రోడ్లను బాగు చేశామన్నారు. జాతీయ రహదారులను విస్తరించామన్నారు. రాష్ట్రంలో అనేక కొత్తరోడ్లను వేయడానికి కేంద్రం అధికంగా నిధులు ఇస్తుందన్నారు. రక్షణరంగంలో దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు లేనిపోని నిందలేయడం దారుణమన్నారు. కరోనా సమయంలో 140కోట్ల మందికి ఉచితంగా కరోనా వ్యాక్సిన్ వేశామని, మరో 50 ప్రపంచ దేశాలకు కూడా ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానిదేనన్నారు. కరోనా వ్యాక్సిన్‌ను కూడా తెలంగాణ రాష్ట్రంలో తయారు చేసి ప్రపంచ దేశాలకందించిన ఘనత మన దేశానికి దక్కుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో అమెరికా. చైనా, పాకిస్తాన్ లాంటి దేశాలు భారతదేశమంటే వెన్నులో భయం పుట్టుకుందన్నారు. ఒకనాడు పాల పొడిని అమెరికా నుంచి దిగుమతి చేసుకొని పాఠశాలల్లో విద్యార్థులకందించేవారు. నేడు ఇతర దేశాలు మనదేశంలో ఉత్పత్తి అవుతున్న పాలను దిగుమతి చేసుకుంటున్నారనే విషయాన్ని విపక్షాలు గుర్తుంచుకోవాలని పరోక్షంగా కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బస్తా యూరియా రూ.2600ఉంటే కేంద్రప్రభుత్వం రైతులకు కేవలం రూ.266లకు విక్రయిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుకు కేంద్రప్రభుత్వం రూ.26 వేలకోట్ల ఖర్చును భరిస్తుందన్నారు. ఒకనాడు క్వింటాల్ ధాన్యం ధర రూ.1300ఉంటే నేడు రూ.2380 రైతులకందిస్తున్నామన్నారు. గత పదేళ్లుగా ఎరువుల ధరలు పెరగలేదని ఇదికేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషియేనని పేర్కొన్నారు. రైతులకు మరిన్ని సేవలందించడానికి తమ ప్రభుత్వం అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టడానికి యత్నిస్తున్నట్లు వెల్లడించారు. దేశాన్ని ప్రపంచదేశాలకు ధీటుగా ఎంతోప్రగతి సాధిస్తుంటే విపక్షాలు ప్రజల్లో దుష్ప్రచారం చేయడం దుర్మార్గం మరోటి లేదని ఆందోళన చెందారు. రంగారెడ్డి జిల్లా నగరానికి ఆనుకొని ఉండడంతో రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పండ్ల ఉత్పత్తిపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. లచ్చిరెడ్డి, పీనర్సింహారెడ్డి, యాచారం మండల బీజేపీ అధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు తాండ్రరవీందర్, బిలకంటిచంద్రశేఖర్‌రెడ్డి, కె.గురునాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉష, ఉద్యానవనశాఖ అధికారి సురేష్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సిఐ నందీశ్వర్‌రెడ్డిలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చూడాలి

కడ్తాల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):హైటెన్షన్ విద్యుత్‌లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధిత రైతులు, నాయకులు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) ను కోరారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం స్థానిక రైతులు, పలువురు నాయకులు ఎమ్మెల్సీని నగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బీదర్ నుంచి మహేశ్వరం వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ టవర్లు, లైన్ల మూలంగా కడ్తాలతో పాటు సమీప గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కడ్తాల మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌లు పేర్కొన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల ప్రాంతంతో మార్కెట్ ధర గజానికి రూ.20 వేలు పలుకుతుందన్నారు. రాములు, కృష్ణ, శ్రీరాములుగౌడ్, పెంటారెడ్డి, పర్వత్‌కుమార్, మహేశ్ కుమార్, శివరామకృష్ణ, శ్రీనివాస్, మహేశ్, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం


దశరథ్ నాయక్, ఆనంద్‌లను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆమనగల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ ఆనంద్‌లు విరాళాలు అందజేశారు. ఆలయ నిర్వాహకుల విన్నపం మేరకు శనివారం దశరథ్‌నాయక్ ఆలయ కైకప్పు స్లాబ్ నిర్మాణానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.50 లక్షలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ స్లాబ్ స్టీల్‌కు రూ.2.50 లక్షలు విరాళాలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి తోడ్పాటునందించిన వారిని ముదిరాజ్ సంఘం నాయకులు సత్కరించి అభినందించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యాదయ్య, సత్యనారాయణ, బాల య్య, బుచ్చయ్య, జంగయ్య, రాఘవేందర్, హెచ్ఆర్ మహేశ్, తదితరులున్నారు.

వైద్యశిబిరం విజయవంతం

కేశంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నా యకులు పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలీశ్వర్‌ల నేతృత్వంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో పల్లె బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్యుల బృందం 300 మందికి వివిధ రకాల పరీక్షలుచేసి మందులు అందించారు. పల్లె బ్రదర్స్‌ను గ్రామస్తులు అభినందించారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : గొర్రెలు, మేకలకు నీలి నాలుక నిరోధక టీకాలు వేయించాలని మహారాజ్‌పేట్ పశు వైద్యాధికారి శ్రావణిగౌడ్ తెలిపారు. మండలంలోని ప్రొద్దటూరు, దొంతాన్‌పల్లి, మియాఖాన్‌గడ్డ, కొండాకల్ తండాలో గొర్రెలు, మేకలకు నీలినాలుక నిరోధక టీకాలు వేశారు.

కేశంపేట : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కేశంపేట మండల నాయకులు తరలివెళ్లారు. నగరంలోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నర్సింహ యాదవ్, మండల ఇన్‌చార్జి కంటుకోట మహేష్, జిల్లా సంస్కృతిక శా ఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి కల్లకోలు తిరుపతి ధర్నాలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి ధర్నాకు మద్దతు తెలిపారు.

కందుకూరు : విద్యార్థులు ఎన్నికల ప్రక్రియపై అవగాహన, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని నేదునూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. టీచర్లు పు ష్పలత, సునీత, కరుణాకర్, సుమేర, హరీష్ ల పర్యవేక్షణలో 755మందికిగాను 650మంది వి ద్యార్థులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఆమనగల్లు : ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని ఎంఈవో పాండు కోరారు. గౌరారం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం హెచ్ఎం శ్రీనివాసాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల సంఖ్య పెంపు, వసతుల కల్పన, పాఠశాల బలోపేతం గూర్చి చర్చించారు. ఆకుతోటపల్లికి చెందిన న్యాలపట్ల నరేందర్‌రెడ్డి రూ.50వేలు విలువల బెంచీలు, గౌరారం గ్రామానికి చెందిన శ్రీపాతి వినోద్‌రెడ్డి రూ.30వేలు, శెట్టిపల్లికి చెందిన రాకేశ్ రావు రూ.10 వేలు, దోనాదుల వెంకట్రాములు రూ.8 వేలు అందించారు. వెంకటాపురం శివ విద్యార్థులకు టై బెల్టులు, ఐడీ కార్డులు సమకూర్చగా ఎంఈవో పాండు పంపిణీ చేశారు. శెట్టిపల్లికి చెందిన వీరేశం పాఠశాలకు బ్యాండ్, రాఘవేందర్ దేశ నాయకుల చిత్రపటాలను బహూకరించారు. దాతలను ఎంఈవో ఆధ్వర్యంలో హెచ్ఎం శ్రీనివాసాచారి సత్కరించారు.

మాడ్గుల : విద్యార్థులకు వ్యక్తిగత వికాసం, నడవడిక గురించి తల్లిదండ్రులు వివరించాలని ఎంఈవో సర్దార్ నాయక్ తెలిపారు. అవురుపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినీవిద్యార్థులకు సంస్కార వికాస సాధన యోగ విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పాదపూజ కార్యక్రమాన్ని ఆచార్య రమేష్ గురూజీ ఆధ్వర్యంలో చేపట్టారు.

తలకొండపల్లి : భక్తుల సౌకర్యార్థం దేవునిపడకల్ ఆలయం వద్ద మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం కుర్చీలను ఏర్పాటు చేశారు. తన తండ్రి కాడేమోని సాయన్న జ్ఞాపకార్థం రూ. 15,500లతో సమకూర్చిన 6 సిమెంట్ కుర్చీలను శనివారం ఆలయం వద్ద ఏర్పాటు చేయించారు. శ్రీశైలంను పలువురు అభినందించారు.

షాబాద్ : బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య అధ్యక్షతన కొమరబండలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పోటీచేసి సత్తా చాటాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చేవెళ్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని కూల్చివేసి నూతన బిల్డింగ్‌లు నిర్మించాన్నారు. నాయకులు చరణ్‌గౌడ్, మణిగౌడ్, ఎండీ అలీ, బంటి, తరుణ్ విద్యార్థులు ఉన్నారు.

ఆలయానికి వాటర్ ట్యాంక్ బహూకరణ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉత్తర రామేశ్వరంగా ప్రసిద్ధిగాంచిన రామేశ్వరం పుణ్యక్షేత్రానికి స్థానిక సాయిరాజా ఫంక్షన్ హాల్ యజమాని మంచిరేవుల సాయికృష్ణ వాటర్ ట్యాంకును బహూకరించారు. శనివారం ఫంక్షన్‌హాలులో ఆలయ సిబ్బందికి అందజేశారు. సీఐ విజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, లయన్స్ క్లబ్ నాయకులు జి.రఘు, దండు శరత్‌చంద్రబాబు, మనోహర్‌రెడ్డి, ఎం.రాంచంద్రయ్య, జి.నారాయణ, ఎం.మురళి, ఎం.అశోక్, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తెలిపారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని ఎరువుల షాపులతో పాటు మండల సహకార సంఘం గోదాములను ఆమె పరిశీలించారు.